క్లుప్తంగా

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం



వర్ధన్నపేట: పట్టణంలోని ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. స్వయంభువుగా వెలిసిన వేంకటేశ్వరస్వామికి దశాబ్దాలుగా ఏటా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రముఖ అర్చకుడు శేషం సంపత్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ వేడుక నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఇత్తడి తొడుగు అందజేత



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారానికి ఏర్పాటు చేసేలా రూ.65 వేల వ్యయంతో చేయించిన ఇత్తడి తొడుగును గ్రామానికి చెందిన జటంగి గంగ సోమయ్య దంపతులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఉపేందర్, అర్చకులు వేణుస్వామి, హేమాంబరాచారి, తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌కు ప్రశంసపత్రం



దుగ్గొండి : 'రాజ్యాంగ మైలురాళ్లు, సమస్యలు, పరిష్కారాలు' అంశంపై కాకతీయ యునివర్శిటీలో జరిగిన జాతీయస్థాయి సదస్సులో సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ప్రముఖ మోటివేటర్ గజ్జి దయాకర్‌కు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మూర్తి ప్రశంసపత్రం అందజేశారు. సదస్సులో దయాకర్ 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ–క్రియాశీలత, జవాబుదారితనం' అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి ప్రశంసాపత్రం అందజేశారు. దయాకర్‌ను వర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, సామాజిక వేత్త హరగోపాల్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన ఎల్లగౌడ్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడారు. పేదలు కష్టాల పాలైతే ఆర్థికంగా ప్రభుత్వం తోడ్పాటు అందించి ఆదుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రాంబాబు, అమీరొద్దీన్, కొమురయ్య, వెంకన్న, సమ్మయ్య, సదాకర్, వీరస్వామి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రేపు తైబజార్‌కు వేలం

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతిరోజూ నడిచే తైబజార్ (సంత)కు రేపు (శనివారం) ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామని ప్రత్యేక అధికారి పాక శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మొయినొద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం దక్కించుకున్న వ్యక్తులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు వసూలు చేసే అధికారం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు, వ్యాపారులు రూ.2 లక్షలుతోపాటు టెండర్ షెడ్యూల్ ధర రూ.500 చెల్లించి షెడ్యూల్ పొందాలని సూచించారు. పర్వతగిరిలోని తైబజార్‌కు, షాపింగ్ కాంప్లెక్స్‌కు ఈనెల 25న వేలం నిర్వహిస్తామని స్పెషల్ ఆఫీసర్ మాలోతు శంకర్‌నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘు ఒక ప్రకటనలో తెలిపారు.

క్షీరాభిషేకం

నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రధాని మోదీకి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంద కృష్ణ నాయకత్వంలో సుమారు 30 ఏళ్లుగా పోరాడుతున్నట్లు చెప్పారు. ఐక్యపోరాటాల ఫలితంగానే పాలకులు స్పందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోట డేవిడ్, గొర్రె అనిల్, గుండేటి వీరేశ కమల్, సదానందం, సుధాకర్, నిర్మల, ప్రమీల, సారమ్మ, సరోజన, సమ్మక్క, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలు నిరుపయోగం..!

- నాలుగేళ్లుగా నిర్వహణ నిధులు పెండింగ్

నెక్కొండ : మండలంలోని పలు రైతు వేదికలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే పేరుతో, సమావేశాల నిర్వహణకు రూ.లక్షలు వెచ్చించి రైతు వేదికలు నిర్మించిన విషయం తెలిసిందే. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఎంచుకొని రైతు వేదికలు నిర్మించి నిర్వహణ బాధ్యతను ఏఈఓలకు అప్పగించింది. ఖర్చులకు నెలవారీగా రూ.9 వేలను కేటాయించగా సదరు మొత్తాన్ని విద్యుత్ బిల్లు, స్వీపర్ వేతనం, స్టేషనరీ కొనుగోలు, తదితరాలకు వినియోగించాల్సి ఉంది. నాలుగేళ్లుగా ప్రభుత్వం నెలవారీగా ఖర్చు కోసం నిధులు విడుదల చేయని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఏఈఓలు సొంత డబ్బుతో నిర్వహణ కొనసాగిస్తున్నారు.

మండలంలోని నెక్కొండ, రెడ్లవాడ, నాగారం, దీక్షకుంట, అలంకానిపేట, తోపనపల్లి, పెద్దకొర్పోలు గ్రామాల్లోని రూ.10 లక్షలు చొప్పున వెచ్చించి ప్రభుత్వం రైతు వేదిక భవనాలు నిర్మించింది. పలు చోట్ల రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించారు. ప్రహరీ, భద్రతా సిబ్బంది లేకపోవడంతో రైతు వేదికల్లోని సామగ్రిని ఆగంతకులు ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం వంటి ఘటనలు చోటు చేసుకుంది. చాలా చోట్ల రైతు వేదికల చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. నీటి వసతి లేకపోవడంతో కొన్ని వేదికలు నిరూపయోగంగా మారాయి. ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి కార్యక్రమాలు రైతు వేదికల్లో చేపట్టాలని నిర్ణయించినా అమలుకు నోచుకున్న దాఖలాల్లేవు. మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలు అందించడానికి ఎల్‌ఈడీ టీవీ, కంప్యూటర్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. మంగళవారాల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలపై మండలంలోని అత్యధిక గ్రామాల్లో రైతులకు అవగాహన లేకపోవడంతో హాజరు కావడం లేదు.



తాళం వేసి ఉన్న నాగారంలోని రైతు వేదిక

దూరంతో ఇబ్బందులు



రైతు వేదిక గ్రామానికి దూరంగా నిర్మించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నాగారంలో రైతు వేదిక నిర్మించగా సూరిపల్లి, చిన్నకొర్పోలు, శివారు తండాల గ్రామ పంచాయతీల రైతులు రావాలంటే సుమారు 12 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. సూరిపల్లిలో పీఏసీఎస్ ఉన్న క్రమంలో రైతులు రాకపోకలు పరిపాటి. నెక్కొండ క్లస్టర్‌కు మార్చాలి.

– మేకల రాములు, రైతు, సూరిపల్లి

నాలుగేళ్లుగా నిధులు పెండింగ్



ప్రభుత్వం నెలవారీ ఖర్చులు బిల్లులు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంచింది. సొంత డబ్బుతో కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుండడంతో ఏఈఓలకు ఇబ్బందులు తప్పడం లేదు. రైతు వేదికలు గ్రామాల్లో నిర్మిస్తే సదుపాయంగా ఉండేది. గ్రామాల శివార్లలో నిర్మించడంతో పట్టించుకునే వారు లేక అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి.

– సాల్లేటి రాజీవ్‌లోచన్, ఏఈఓ

దివ్యాంగులకు భరోసా ఇవ్వని ప్రభుత్వం



తలపై బండరాళ్లు పెట్టుకుని నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

- బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

వర్ధన్నపేట: బడ్జెట్‌లో ప్రభుత్వం దివ్యాంగులకు భరోసా ఇవ్వలేదని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ అన్నారు. పట్టణంలో దివ్యాంగులు తలపై బండరాళ్లు పెట్టుకుని గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రభుత్వం దివ్యాంగులకు తగిన మేరకు నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. వెంటనే సవరించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా దివ్యాంగులు అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. దివ్యాంగులకు అట్రాసిటీ తరహా చట్టాన్ని అమలు చేస్తామని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, తదితర అనేక హామీలు ఇచ్చి నెరవేర్చకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోగుల శేఖర్‌రెడ్డి, గుడిపల్లి సుమతి, ఆకారపు వెంకన్న, తలారి సహదేవుడు, ముత్తయ్య, ఇస్లావత్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

దుగ్గొండి : బడుగుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అర్హులందరికీ ఖచ్చితంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. యువ వికాసంతో నిరుద్యోగ యుకత ఉపాధి మెరుగు పడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, ద్యాగం శివాజీ, రవివర్మ, సురేశ్, మాదాసి సాంబయ్య, ప్రశాంత్, శ్రీనివాస్, వినోద్, నాగరాజు, యుగందర్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు

'అంగన్‌వాడీ'లో అన్నప్రాసన



నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్ర శివారులోని ఈర్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ సరోజన గురువారం అన్నప్రాసన చేయించారు. అనంతరం సరోజన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో లభిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పవనకుమారి, ఉపాధ్యాయురాలు ఆరాధన, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు ప్రాధాన్యత

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

నర్సంపేట/నెక్కొండ: సీపీఎస్ రద్దుకు ప్రాధాన్యత ఇస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. నర్సంపేట, నెక్కొండలో గురువారం ఆయన మాట్లాడారు. త్వరలో ఉద్యోగులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు నగదు రహిత చికిత్స అందించేలా హెల్త్‌కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. తన సొంత మండలంగా భావించే నెక్కొండకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల గొంతుకను శాసనమండలిలో వినిపిస్తానని తెలిపారు. సామాజిక భద్రతకు సమానమైన పెన్షన్ రాకపోవడంతో ఉద్యోగులు అభద్రతాభావానికి గురవుతున్నారని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనతోపాటు పీఆర్‌టీయూ కృషిచేస్తోందని వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. నర్సంపేటలో జరిగిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వర్, నాయకులు సాంబయ్య, మల్లయ్య, మహేందర్, భాస్కర్, భిక్షపతి, వెంకన్న, రవిచంద్ర, చంద్రయ్య, రమేష్, అశోక్, శ్రీధర్, నెక్కొండ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రత్నమాల, హెచ్‌ఎం రంగారావు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కర్ర యా కూబ్‌రెడ్డి, నల్లబెల్లి మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు యాకయ్య, మహిళా అసోసియేట్ మండల అధ్యక్షురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యం

- సీపీఎం పట్టణ కమిటీ నాయకుడు అనిల్

నర్సంపేట : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం పట్టణ కమిటీ నాయకుడు కలకోట అనిల్ విమర్శించారు. పట్టణంలో ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై గురువారం సర్వే నిర్వహించారు. ప్రజలను కలిసి సమస్యలపై నాయకులు, కార్యకర్తలు అధ్యయనం చేశారు. వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు గుప్పించి ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలి మోసపూరితంగా పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి, రోడ్లు, డ్రైయినేజీ, ఇతర సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, అధికార పార్టీ నాయకులు స్పందించి పట్టణంలో నెలకొన్న అన్ని సమస్యలనూ త్వరగా పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపట్టడంలో చొరవ చూపాలని ఆకాంక్షించారు. లేనిపక్షంలో ప్రభుత్వ తప్పుడు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి పోరాటాలు నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, మహేందర్, తాటిపాముల వెంకన్న, సరిత, మల్లేశ్, ఎల్లయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న అనిల్, నాయకులు

'సఖి' సేవలపై అవగాహన



గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపెల్లిలో సఖి కేంద్రం సేవలపై కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న మహిళలకు అవగాహన గురువారం కల్పించారు. సఖి కేంద్రం, మహిళా సంక్షేమ శాఖ, సర్వోదయ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల, స్వప్న మాట్లాడారు. బాధిత మహిళలు, బాలికలు అత్యవసర పరిస్థితుల్లో 181కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. బాధితులకు పోలీస్, న్యాయ సేవలతోపాటు కౌన్సిలింగ్, తాత్కాలిక వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. మహిళలు సఖి సేవలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమెన్ హబ్ ప్రతినిధి పావని, ఆర్పీ సునీత తదితరులు పాల్గొన్నారు.

'రైస్ మిల్లర్స్' అధ్యక్షుడికి సన్మానం



నర్సంపేట:రవీందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

నర్సంపేట : రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పట్టణానికి చెందిన గోనెల రవీందర్‌ను ఆయన నివాసంలో ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో గురువారం శాలువాతో సన్మానించారు. అనంతరం రవీందర్ మాట్లాడారు. మిల్లర్ల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి చేసిన కృషి ఫలితంగానే జిల్లా అధ్యక్షుడిగా తాను ఎన్నికైనట్టు చెప్పారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్ మాట్లాడారు. రవీందర్ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెపా డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల యాదగిరి, గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, నాయకులు చేరాలు, పొన్నం రాజు, తదితరులు పాల్గొన్నారు.



నల్లబెలి : మౌనికను, ఆమె తల్లిదండ్రులను..

ఉద్యోగం సాధించిన యువతికి..

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన ఉడుత మౌనిక అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గ్రేడ్–1 పరీక్షలో ప్రతిభ చాటి ఉద్యోగం సాధించిన సందర్భంగా ఆమెతోపాటు ఆమె తల్లిదండ్రులు రమణి రాజన్నలను వారి నివాసంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు గురువారం శాలువాతో సన్మానించారు. అనంతరం సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింద కుమారస్వామి మాట్లాడారు. బీసీ సామాజికవర్గానికి చెందిన యువత ప్రతిభ చాటి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. మౌనికను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోగ భద్రయ్య, దేవులపల్లి శ్రీనివాస్, సామల వీరన్న, చింతకింది శ్రీహరి, కడియాల క్రాంతి, వేముల రాజు, లక్ష్మీరాయణ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు

- పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు రవి

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొరగా నిధులు కేటాయించి తీరని అన్యాయం చేసిందని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి ఆందోళన వెలిబుచ్చారు. పట్టణంలోని ఆ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు అనేక ఏళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉండగా కేవలం 7.57 శాతం నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. కనీసం 30 శాతం కేటాయించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలను పరోక్షంగా ప్రోత్సహించే దిశగా ప్రభుత్వ విద్యారంగానికి నామమాత్రంగా నిధులు కేటాయిస్తూ నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, గురుకులాలు, విశ్వవిద్యాలయాలు అభివృద్ధి చెందేలా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమరశీల పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు రమేశ్, గణేశ్, సాయి, రవితేజ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఈఓ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట, ఖానాపూరం భారతమ్మ రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సీఈఓ ఉద్యోగానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చైర్మన్ మోటూరి రవి, వైస్ చైర్మన్ నాగమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి (శుక్రవారం) నుంచి 22వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఎస్సీ అగ్రికలర్, బీఎస్సీ డిప్లొమా చదివి 35 ఏళ్లలోపు వయస్కులై ద్విచక్ర వాహనంతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి మండలాలకు చెందిన యువత సంబంధిత పత్రాలతో నర్సంపేట మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలో నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ తిరుపతి, ఏఈ జోగానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారావుపేట, ఉప్పరపల్లి 33 కేవీ విద్యుత్ లైన్లలో మరమ్మతుల నేపథ్యంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వీయ నియంత్రణతోనే ఉన్నతి

- నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ

ఖానాపురం : స్వీయ నియంత్రణతోనే జీవితంలో ఉన్నతి సాధించగలమని నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ స్పష్టం చేశారు. మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్ గురువారం నిర్వహించిన 'ఎక్స్‌పర్ట్ టాక్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర అవసరం పరికరాలకు దూరంగా ఉండాలని సూచించారు. అవసరమున్న సందర్భాల్లోనే ఫోన్ మాట్లాడాలని చెప్పారు. అవసరం లేని దేనికోసం కూడా సమయాన్ని వృథా చేయొద్దని తెలిపారు. ఆరోగ్యానికి, భవిష్యత్తుకు నష్టం కలిగించే వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రణాళికాయుతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. అనంతరం ఎస్సై రఘుపతి మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో సాధించాల్సిన లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెరుక సునీత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సాయిరమణ

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి గురువారం పరీక్ష సామగ్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దని సూచించారు. ప్రశాంతంగా పరీక్ష రాస్తే మెరుగైన ఫలితాలు ఖాయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోజెర్వు ప్రైమరీ స్కూల్‌లో..

చెన్నారావుపేట మండలంలోని బోజెర్వు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు చెన్నారావుపేటకు చెందిన గాదెగోని సదయ్య జ్ఞాపకార్థంగా గాదగోని సంధ్య రాజు ప్లేట్లు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు విజేందర్ రావు, పరమేశ్వర్, రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో సంధ్య రాజు, తదితరులు

పరామర్శ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్‌ను ఆమె నానమ్మ వీరమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి గురువారం పరామర్శించారు. తొలుత వీరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, నాయకులు కొరె రాకేశ్, పాల్తియా శశిధర్, మరాఠి ఉప్పలయ్య, హరికృష్ణ, శ్రీను, మహేందర్, మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

గీసుకొండ : ప్రభుత్వ భూమిలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న గుడిసెవాసులకు ప్రభుత్వం వెంటనే పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. గొర్రెకుంట శివారులోని పీసరి కొమురయ్య నగర్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత ఇళ్లు, స్థలాలు లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు అనేక ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కేవలం విద్యుత్, నీటి, తాత్కాలిక ఇంటి నెంబర్, తదితర వసతులు కల్పిస్తూ చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. గుడిసెవాసులందరికీ వెంటనే పట్టాలివ్వడంతోపాటు నిధులు కేటాయించి ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దిశగా పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, మండల కార్యదర్శి తోట చంద్రకళ, జిల్లా కార్యవర్గ సభ్యులు గెండె భద్రి, మద్దెల శ్రీలత, వనమ్మ, వేణు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

విత్తన ఎంపికే దిగుబడికి మూలం

సంగెం : సరైన విత్తన ఎంపికే దిగుబడిలో మూలమని ఆగ్రోస్టార్ కంపెనీ తెలంగాణ, ఏపీ జోనల్ మేనేజర్ పవన్ కన్న తెలిపారు. మండల కేంద్రంలోని గోపిరెడ్డి మహేందర్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఆ కంపెనీకి చెందిన ఆగ్రోస్టార్–1232 రకం మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు విత్తనాలను వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలరు నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పంట పూర్తి అయ్యే వరకు బిల్లులుగా జాగ్రత్తగా ఉంచుకోవాలని చెప్పారు. ఆ రకం మొక్కజొన్న అధిక దిగుబడి ఇచ్చిందన్నారు. క్షేత్ర ప్రదర్శనకు సంగెం, తిమ్మాపూర్, ఎల్గూర్‌రంగంపేట, కుంటపల్లి, కాట్రపల్లి, గాంధీనగర్, చింతలపల్లి, ఆశాలపల్లి, రామచంద్రాపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు హాజరు కాగా కార్యక్రమంలో కంపెనీ తెలంగాణ రీజనల్ మేనేజర్ శేఖర్, వరంగల్ మేనేజర్ గొర్రె భాస్కర్, ప్రతినిధి శశిధర్, తదితరులు పాల్గొన్నారు.